క్లుప్తంగా

బీజీకే జెడ్పీహెచ్ఎస్‌కు కంప్యూటర్ అందజేత



పెడన: పట్టణంలోని భట్టజ్ఞాన కోటయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలకు విశ్రాంత ఉన్నత విద్యాశాఖాధికారి మట్టా రాధాకృష్ణమూర్తి రూ.40 వేలు విలువైన కంప్యూటర్, ప్రింటర్లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణమూర్తిని పాఠశాల హెచ్ఎం అద్దంకి అశోక్‌కుమార్‌తో పాటు ఉపాధ్యాయులు పలువురు ఘనంగా సత్కరించారు. రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ప్రశ్నపత్రాల కోసం ఎదురుచూడకుండా ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాల మేరకు ఆయా ప్రశ్నపత్రాలను నిర్ణీత సమయానికి విద్యార్థులకు అందించేలా కంప్యూటర్, ప్రింటర్లు ఉపయోగపడతాయనే ఉద్దేశంతోవాటిని అందజేశామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం తీర్థవతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

15 వేల మందికి అన్న సమారాధన



పెడన: పట్టణంలోని శ్రీపైడమ్మ జాతర మహోత్సవాలు పూర్తయిన తర్వాత సోమవారం ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ ఈవో తిక్కిశెట్టి వీరవెంకటమోహనరావు ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి పర్యవేక్షించారు. దేవదాయశాఖ సిబ్బంది, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు, సత్యసాయి సేవా సంస్థలు అన్నప్రసాదాలను భక్తులకు అందజేశారు. సుమారు 15వేల మందికిపైగా భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రప్రసాద్, పెడన ఎస్‌ఐ జి.సత్యనారాయణ సిబ్బందితో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

హరిదాసొచ్చె.. పండగ కళ తెచ్చె..



కృత్తివెన్ను: తూరుపు తెలవారుతుండగా ఉదయభానుడు నులిలేత కిరణాలతో పాటు శ్రావ్యమైన సుమధుర కీర్తనాలాపనలతో హరినామస్మరణ చేస్తూ పల్లెల్లో హరిదాసుల గానం వినిపిస్తోంది. సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామాల్లో హరిదాసులు సందడి చేస్తున్నారు. కృత్తివెన్ను మండలంలోని పలు గ్రామాల్లో హరిదాసులు, డూడూ బసవన్నలు తిరుగుతూ సంక్రాంతి పండుగ కళ తెచ్చారు.

'పది' విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ



గోగినేనిపాలెం(ఘంటసాల): ఉచిత స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు తమ్మన వేణుగోపాలరావు అన్నారు. ఘంటసాల మండలం గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో గణిత ఉపాధ్యాయినిగా చేస్తున్న డీఎల్వీ బిజిలీరాణి సొంత ఖర్చులతో సోమవారం 10వ తరగతి విద్యార్థులకు గణితశాస్త్ర స్టడీ మెటీరియల్‌ను అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నాటు సారా తయారు చేసినా.. అమ్మినా కఠిన చర్యలు

పెడన: నాటు సారా తయారు చేయడమే కాకుండా దాన్ని అమ్మినా, ఇతర ప్రాంతాలకు రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని మచిలీపట్నం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ భార్గవ్ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని నందమూరు పంచాయతీ కోటవానిపాలెం గ్రామంలో నాటుసారా గురించి గ్రామ సభను నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వెంకటేశ్వరమ్మ, రామ శేషయ్య, ప్రకాష్ పాల్గొన్నారు.

జెడ్పీ రోడ్డుకు మరమ్మతులు

రావివారిపాలెం(మోపిదేవి): మోపిదేవి నుంచి రావివారిపాలెం వరకు సుమారు 300 మీటర్ల పొడవున్న జెడ్పీ రోడ్డుపై బీటీ ప్యాచ్ వర్క్ పనులను సోమవారం ప్రారంభించారు. జెడ్పీ నిధులు రూ. 10 లక్షలతో బీటీ రోడ్డు నిర్మిస్తున్నట్లు సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఫణీంద్ర తెలిపారు. మచిలీపట్నానికి చెందిన కాంట్రాక్టర్ రోడ్డు పనులు చేపట్టారని, రెండు రోజుల్లో నిర్మాణ పనులు పూర్తవుతాయని వివరించారు.

ప్రాచీన కళకు జీవం

- కర్రసాములో దిట్టలు.. మచిలీపట్నం విద్యార్థులు
- అబ్బుర పరుస్తున్న చిన్నారుల విన్యాసాలు
- పోటీల్లో పాల్గొంటే పతకాలే



కర్రసాములో చిన్నారుల విన్యాసాలు

> ప్రాచీన కళ అయిన కర్రసాముకు జీవం పోస్తున్నారు పలువురు విద్యార్థులు. ఈ కళ కనుమరుగుతున్న నేపథ్యంలో నగరానికి చెందిన కొందరు దీన్ని కాపాడుకొంటూ, ఆత్మరక్షణ కోసం కర్రసాము సాధన చేస్తూ పతకాలు పొందుతున్నారు. కర్ర చేతితో పట్టుకుంటే చాలు చురకత్తిలా మార్చేస్తున్నారు. ప్రత్యర్థులు ఎవరైనా గెలువుబావుటా ఎగరేస్తున్నారు. ప్రాచీన కాలం నుంచి ప్రసిద్ధి చెందిన కర్రసాములో సంచనాలు సృష్టిస్తున్నారు మచిలీపట్నంలోని కొందరు విద్యార్థులు.

మచిలీపట్నంటౌన్: ప్రాచీన కళ కర్రసామును సాధన చేస్తూ పతకాలు సాధిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు ఆ విద్యార్థులు. మర్చిపోతున్న కళను కాపాడానికి వారు కంకణం కట్టుకొన్నారు. రామాయణం కాలం నుంచి కూడా ఈ కళకు ఎంతో ప్రాధాన్యముంది. విరోధులు, దొంగల నుంచి ఆత్మరక్షణ కోసం కర్రసాము ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ఆయుధాలు లేని నాటి నుంచి కర్రసామును ఆత్మ రక్షణకు వినియోగించేవారు. ఈ కళ రానురానూ కనుమరుగవుతోంది. కేవలం కొన్ని గ్రామాల్లో మాత్రమే కర్రసాముపై పట్టున్న వారు ఉన్నారు. ఆత్మరక్షణ కోసమే కాకుండా అంతరించిపోతున్న కళను కాపాడుకునేందుకు నగరానికి చెందిన పలువురు విద్యార్థులు సాధన చేస్తున్నారు. నేర్చుకున్న కళను ప్రదర్శిస్తూ పలు పోటీల్లో పాల్గొని పతకాలు, ప్రశంసా పత్రాలను పొందుతున్నారు.

దొంతులమ్మ గుడి వద్ద శిక్షణ

నగరంలోని ఉల్లింగిపాలెం శ్రీ దొంతులమ్మతల్లి గుడి ప్రాంగణం వద్ద జరుగుతున్న కర్రసాము శిక్షణలో నగరానికి చెందిన 14 మంది చిన్నారులు ప్రతిరోజూ పాల్గొని సాధన చేస్తున్నారు. వీరంతా 7 నుంచి 9వ తరగతి లోపు విద్యార్థులే. వీరికి కోచ్ అరవింద్ సత్య కర్రసాములో చక్కటి శిక్షణ ఇస్తున్నారు. మచిలీపట్నం తర్వాత అవనిగడ్డ, చల్లపల్లి ప్రాంతాల్లో పలువురు చిన్నారులు కర్రసాములో శిక్షణ పొందుతున్నారు.

పోటీలకు వెళితే పతకాలే

నగరానికి చెందిన కర్రసాము నేర్చుకుంటున్న చిన్నారులు పలు ప్రాంతాల్లో జరిగే పోటీల్లో పాల్గొని పతకాలను సాధిస్తున్నారు. వీరిని పలువురు అభినందిస్తున్నారు. నగరానికి చెందిన ఎస్.నాగప్రత్యూష జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని 2 స్వర్ణ, ఒక సిల్వర్, రాష్ట్రస్థాయిలో 2 స్వర్ణ, ఒక సిల్వర్ పతకాలను సాధించింది. ఆమె తమ్ముడు ఎస్.వెంకటచక్రీష్ జాతీయ స్థాయిలో రెండు స్వర్ణ, ఒక సిల్వర్, రాష్ట్రస్థాయిలో రెండు స్వర్ణ, ఒక బ్రాంజ్ పతకాలను పొందాడు. ఇలా పలువురు చిన్నారులు పతకాలు సాధిస్తున్నారు. గత నెలలో నెల్లూరులో జరిగిన జాతీయ కర్రసాము చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న నగరానికి చెందిన ఎనిమిది మంది చిన్నారులు ఏకంగా 13 స్వర్ణ పతకాలను సాధించడం గమనార్హం. కృష్ణా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 22 మంది బాలబాలికలు పోటీల్లో పాల్గొని 42 స్వర్ణ పతకాలు సాధించారు.



సాధించిన పతకాలతో చిన్నారులు

ప్రాచీన కళను బతికించాలనే..



కనుమరుగవుతున్న ప్రాచీన కళ కర్రసామును బతికించాలనే ఉద్దేశంతో ఈ విద్యలో పట్టు సాధిస్తున్నాను. కర్రసాముపై నాకున్న మక్కువ, తండ్రి ప్రోత్సాహంతో తర్ఫీదు తీసుకుంటున్నాను. ఓ పక్క చదువుకుంటూనే ప్రతిరోజూ కర్రసాము శిక్షణ పొందుతున్నాను. జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించటం ఎంతో ఆనందానిస్తోంది.

–ఎస్.నాగప్రత్యూష, 9వ తరగతి విద్యార్థిని

ఆత్మరక్షణ కోసం..



కర్రసామును ఆత్మరక్షణ కోసం నేర్చుకుంటున్నాను. చిన్ననాటి నుంచే నాకు కర్రసామంటే ఎంతో ఇష్టం. నా తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా తోడై నేను ఈ కళను నేర్చుకునేందుకు వీలు కలిగింది. పోటీల్లో పాల్గొని పతాకాలు సాధించాను. జాతీయ పోటీల్లో ఒక స్వర్ణ, రెండు బ్రాంజ్, రాష్ట్ర స్థాయిలో ఒక సిల్వర్ పతకాలను పొందాను.

–భవేష్, 7వ తరగతి విద్యార్థి



కర్రసాములో చిన్నారుల విన్యాసాలు

పెడనలో పీజీఆర్ఎస్‌కు రెండు అర్జీలు

పెడన: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన పీజీఆర్ఎస్ (ప్రజావిజ్ఞప్తుల దరఖాస్తుల స్వీకరణ)లో రెండు అర్జీలు వచ్చాయని ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్ అన్నారు. పెడన పట్టణానికి చెందిన 60 ఏళ్లు దాటిన వ్యక్తి వృద్ధాప్య పింఛనుకు అర్హుడునని, తనకు పింఛను ఇప్పించాలని లిఖితపూర్వకంగా అర్జీ అందజేశారు. కాకర్లమూడి గ్రామంలో దారి సమస్యపై ఆ గ్రామానికి చెందిన కొందరు అర్జీని అందజేశారు. మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.జయరామ్, వ్యవసాయశాఖ ఏవో ఇన్‌చార్జి నూరున్నీసా తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి

కోడూరు: సాగునీటి సమస్యల పరిష్కారానికి నీటి సంఘాల అధ్యక్షులు సమష్టి కృషి చేయాలని తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక ఇరిగేషన్ కార్యాలయం వద్ద జేఏ విజయ్‌కుమార్ అధ్యక్షతన మండలంలో డీసీ పరిధిలోని ఉన్న సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రానున్న రోజుల్లో సాగునీటి ఎద్దడి లేకుండా ముందు నుంచే ప్రణాళిక రూపొందించాలని వెంకటేశ్వరరావు సూచించారు. కాలువలకు అవసరమైన మరమ్మతులను గురించాలన్నారు. ఇరిగేషన్ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, డ్రైనేజీ డీఈ బాబునాయక్, జేఈ కరీమ్, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుపై శ్రద్ధ చూపాలి

కృత్తివెన్ను: పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతంపై ఉపాధ్యాయులతో పాటు, తల్లితండ్రులు కూడా శ్రద్ధ తీసుకోవాలని పాఠశాల యాజమాన్య సమావేశంలో చైర్మన్ ముత్యాలరాజు అన్నారు. సోమవారం చినగొల్లపాలెం ఏటిమెండి ప్రాథమిక పాఠశాలలో కమిటీ సమావేశం జరిగింది. కార్యక్రమంలో హెచ్ఎం పురుషోత్తం, ఉపాధ్యాయులు బాలు, సీఆర్పీ దినేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభిస్తున్న మంత్రి సవిత

మోపిదేవి: విద్యార్థులకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్య అందించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత అన్నారు. మోపిదేవిలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల్లలో సోమవారం కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తుకు ఉపయోగపడేలా విద్యార్థులకు ప్రభుత్వం సాంకేతిక విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎంజేపీఏపీ గురుకుల పాఠశాలలు 107 ఉండగా, ఇక్కడ చక్కని విద్యా ప్రమాణాలతో పాటు క్రీడ, సాంస్కృతిక కార్యక్రమాలపై శిక్షణ కల్పించడం అభినందనీయమన్నారు. అనంతరం జోనల్–2 స్థాయిలో నిర్వహిస్తున్న ఆటల పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులు తమకు జాబ్ సెక్యూరిటీ కల్పించి జీతాలు పెంచాలని మంత్రికి వినతిపత్రాలు అందజేశారు. గురుకులాల్లో పనిచేస్తున్న స్టాఫ్‌కు కూడా 62 సంవత్సరాల వయో పరిమితి కల్పించాలని ఉపాధ్యాయులు విన్నవించారు. గురుకులాల రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వీరరవి, మండలి వెంకట్రామ్, జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలి



జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: అంగన్‌వాడీలను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆలిండియా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫెడరేషన్ 34వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం బుట్టాయిపేటలోని సీఐటీయూ కార్యాలయం వద్ద ఇండియా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫెడరేషన్ జెండాను సీనియర్ వర్కర్ కుమారి ఆవిష్కరించారు. సంఘం జిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోలినాయుడు, మండల కార్యదర్శి సీహెచ్ జయరావు, మచిలీపట్నం ప్రాజెక్టు అధ్యక్షురాలు టి సుజాత, ప్రాజెక్టు నాయకురాలు సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

'వాసవి' ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్, వాసవి కపుల్స్ క్లబ్ ల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా నగరంలోని మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను క్లబ్ ప్రతినిధులు అందజేశారు. క్లబ్‌ల ప్రతినిధులు మాట్లాడుతూ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఇరుకుల రామకృష్ణ, జిల్లా గవర్నర్ అన్నం సాయి సునీత ఆదేశాలతో గొడుగుపేటలోని శంకరమఠంలో ఆదేశానుసారం సంక్రాంతి సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించామన్నారు. ముగ్గుల పోటీలకు జడ్జిలుగా సామా పద్మజ, జల్లూరి సావిత్రి వ్యవహరించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రెసిడెంట్ జల్లూరి రాంబాబు, సెక్రటరీ జయవరపు ప్రసాద్, ట్రెజరర్ సామా గణేష్, వాసవి క్లబ్ వనిత అధ్యక్షురాలు కె శ్రీదేవి, సెక్రటరీ ఆర్ షామిలి ట్రెజరర్ ఏ సంగీత, వాసవి కపుల్స్ క్లబ్ అధ్యక్షులు తమ్మన మధుసూధన ప్రసాద్– శిరీష తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

మచిలీపట్నంటౌన్: కృష్ణా జిల్లాలో విద్యార్థులపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టి, విద్యార్థులు, మహిళలకు రక్షణ కల్పించాలని విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి అశోక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ కృష్ణా జిల్లా 50వ మహాసభ సందర్భంగా సోమవారం స్థానిక రేవతి సెంటర్ నుంచి కోనేరు సెంటర్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోనేరు సెంటర్లో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ 6,7 తేదీల్లో జరుగుతున్న మహాసభలు జయప్రదం చేయాలని, జిల్లాలో ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, కృష్ణా యూనివర్సిటీ హాస్టల్ భవనాన్ని వెంటనే ప్రారంభించాలని, జిల్లాలో విద్యాసంస్థలను బలోపేతం చేస్తానని చెప్పిన ప్రజా ప్రతినిధులు విద్యారంగ సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే వాళ్లందరికీ తల్లికి వందనం పేరుతో రూ .15 వేలు ఏడాది ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఈ సంవత్సరం అమలు చేయబోమని తెలపడాన్ని ఎస్ఎఫ్ఐ గా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.సమరం, జిల్లా అధ్యక్షుడు ప్రేమ్, జిల్లా కమిటీ సభ్యులు సమీర్ సలీం, కీర్తి, నాగేంద్ర, మచిలీపట్నం నగర కమిటీ సభ్యులు ప్రదీప్, అక్షయ్, జయకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.1.08 లక్షల విరాళం



గూడూరు: కప్పలదొడ్డిలోని అందేవారి వీధిలో పునర్నిర్మాణంలో ఉన్న శ్రీసీతారాముల ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు పేరిశెట్టి గోపీకృష్ణ, యశోద గోపీకృష్ణ దంపతులు రూ.1.08 లక్షల విరాళం అందజేశారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యుడు అందే వెంకయ్యనాయుడుకు చెక్‌ను వారు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

850 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



పెడన: మచిలీపట్నం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టణంలోని దక్షిణ తెలుగుపాలెంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజయవాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వై.శ్రీనివాస చౌదరి ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి వెంకటేశ్వరమ్మ సోమవారం ఉదయం దాడులు నిర్వహించారు. నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 850 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. భూమిలో పాతిపెట్టిన డ్రమ్ముల్లో ఉంచిన బెల్లం ఊటను పారబోశారు. దాడుల్లో సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎం.రామశేషయ్య, హెచ్‌సీ సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



పెడన: పట్టణంలోని భట్టజ్ఞాన కోటయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1993–94 ఏడాదిలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఇబ్రహీంపట్నం మండలం కాచవరం ఎంపీపీ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న ప్రవల్లిక చికిత్స కోసం రూ.15వేలు ఆర్థిక సాయం చేశారు. సోమవారం పూర్వవిద్యార్థులు అందించిన సాయాన్ని విద్యార్థినికి, ఆమె తల్లి కుమారికి అందజేశారు. కార్యక్రమంలో కాచవరం పాఠశాల ఉపాధ్యాయుడు, పూర్వ విద్యార్థి మహమ్మద్ ఇర్ఫాన్, 1993–94 పూర్వ విద్యార్థులు ఉబేదుల్లా ఖాన్, అబ్దుల్ కలాం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భవాని తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి సారె



అవనిగడ్డ: స్థానిక గీతామందిరంలో సోమవారం గోదాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గోదాదేవి అమ్మవారికి పలు రకాల పూలు, పండ్లు, మిఠాయిలు, చలిమిడి, పండ్ల రసాలు, పానకంతో కూడిన సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేశారు.

శ్రీకాకుళేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.63 లక్షలు

శ్రీకాకుళం(ఘంటసాల): ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలోని శ్రీకాకుళేశ్వర స్వామి దేవస్థానంలోని హుండీ కానుకలను సోమవారం లెక్కించగా రూ.3,63,314 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళేశ్వరస్వామి దేవస్థానంలో 15 నెలల తర్వాత మచిలీపట్నం దేవదాయశాఖ తనిఖీ అధికారి కె.శ్రీనివాస్ పర్యవేక్షణలో భక్తులు, ఆలయ సిబ్బంది హుండీని లెక్కించగా రూ.3,63,314ఆదాయం వచ్చినట్లు చెప్పారు.

విద్యార్థుల భవితకు బంగారుబాట



విద్యార్థులను అభినందిస్తున్న అప్పారావు, ఎంఈఓ రామదాసు



లాంగ్ జంప్‌లో విద్యార్థులు

- ఆదర్శంగా కోడూరు విద్యాశాఖ
- గ్రీన్ స్టోన్ ఇన్‌ఫ్రా చైర్మన్ అప్పారావు
- 10 రోజుల పాటు సాగే బాలోత్సవానికి శ్రీకారం

కోడూరు: కోడూరు మండల విద్యాశాఖ విద్యార్థులకు వినూత్న కార్యక్రమాలకు నిర్వహిస్తూ విద్యార్థుల భవితకు బంగారుబాట వేస్తూ ఆదర్శంగా నిలుస్తోందని గ్రీన్ స్టోన్ ఇన్‌ఫ్రా చైర్మన్ అప్పికట్ల అప్పారావు అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో బాలోత్సవానికి సోమవారం శ్రీకారం చుట్టారు. స్వతంత్రపురం జెడ్పీ పాఠశాల క్రీడా ప్రాంగణంలో బాలోత్సవ ప్రారంభోత్సవ సభను ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు అధ్యక్షతన నిర్వహించారు. తొలిరోజు విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహించారు. కబడ్డీ, స్కిప్పింగ్, స్టిక్ రిలే, లెమన్ అండ్ స్పూన్, త్రోబాల్, రన్నింగ్ తదితర పోటీలు జరిపారు. ఎంఈఓ–2 శ్రీనివాసరావు, హెచ్ఎం ఆలా వెంకటరమణ, పీడీలు జి.శ్రీనివాస్ పెరుమాళ్, రిటైర్ హెచ్ఎం ఆలా రమేష్, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆహారంతో మెరుగైన ఆరోగ్యం



గోగినేనిపాలెం హైస్కూల్లో మాట్లాడుతున్న హెచ్ఎం వేణుగోపాలరావు

గోగినేనిపాలెం(ఘంటసాల): సంపూర్ణ ఆహారంతో మెరుగైన ఆరోగ్యం సాధించవచ్చని గోగినేనిపాలెం హైస్కూల్ హెచ్ఎం తమ్మన వేణుగోపాలరావు అన్నారు. ఘంటసాల మండలం గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో కిశోరి వికాసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం జె.శ్రీవాణి మాట్లాడుతూ బాలికల పట్ల లింగ వివక్ష ఉండకూడదని, వ్యక్తిగత రుతుస్రావ పరిశుభ్రత, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, మానవ అక్రమ రవాణ, ఆత్మ రక్షణ, నాణ్యమైన విద్య, నైపుణ్యం, ఉపాధి తదితర అంశాల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ టి.కల్యాణి, చినకళ్లేపల్లి ఏఎన్ఎం బి.కుసుమ కుమారి, జీఎంఎస్‌కేవీ స్వాతి, చినకళ్లేపల్లి, గోగినేనిపాలెం, పాపవినాశనం అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్.సునీత, ఎం.సునీత తదితరులు పాల్గొన్నారు.

హుండీ పగలగొట్టిన దుండగులు



తరకటూరులోని ఆలయంలో పగలగొట్టిన హుండి

గూడూరు: తరకటూరులోని శ్రీ అంకమ్మతల్లి ఆలయంలో గుర్తుతెలియని దుండగులు ఆదివారం అర్ధరాత్రి హుండీ పగలగొట్టారు. మచిలీపట్నం–విజయవాడ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఆలయంలో దొంగలు పడటం చర్చనీయాంశంగా మారింది. ఆలయంలో భక్తులు ధూపదీప నైవేద్యాల కోసం హుండీలో కానుకలు వేస్తుంటారు. దాదాపు రూ.10వేల వరకు నగదు ఉండొచ్చని ఆలయ ధర్మకర్త తలారి నాగమల్లేశ్వరరావు తెలిపారు. కొంత కాలం క్రితం ఇలాగే తరకటూరులోని రామాలయంలో కూడా దుండగులు చొరబడి స్వామివారి ఆభరణాలు, హుండీలోని నగదు దొంగలించారు. వరుసగా తరకటూరులోని ఆలయాలలో దొంగలు పడుతుండటంపై భక్తులు ఆందోళన చెందుతున్నారు.

పుదుచ్చేరి సీఎంను కలిసిన మంత్రి సవిత



పుదుచ్చేరి సీఎం రంగస్వామికి పూలమొక్క అందజేస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

మోపిదేవి: పుదుచ్చేరి సీఎం ఎన్ రంగస్వామిని ఏపీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌తో కలిసి మర్యాదపూర్వకంగా కలిసారు. జాతీయ రహదారి 216 మీదగా ప్రయాణం చేస్తూ కృష్ణాజిల్లా మోపిదేవిలో భోజన విరామం కోసం ఎస్ విహార్ హోటల్లో సోమవారం మధ్యాహ్నం రంగస్వామి బస చేశారు. అప్పటికే మోపిదేవిలో ఉన్న మంత్రి సవిత విషయం తెలుసుకుని హోటల్లో బస చేసిన పుదుచ్చేరి సీఎంను కలిసి పూలమొక్క అందించి సత్కరించారు.

ప్రేమ వ్యవహారంతో.. ద్విచక్ర వాహనం తగలబెట్టారు!

పెడన: పట్టణంలో సంచలనం రేకెత్తించిన గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని తగలబెట్టిన సంఘటనలో ప్రేమ వ్యవహారం కారణంగా తెలుస్తోంది. 'ద్విచక్ర వాహనాన్ని తగులబెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు' శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. పోలీసుల విచారణలో పెడన ఐడీఎఫ్‌సీ బ్యాంకులో తమిళనాడుకు చెందిన దొరై అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అదే బ్యాంకులో విధులు నిర్వహించే యువతిని ప్రేమించాడు. ఆ యువతి గతంలో మచిలీపట్నం చిలకలపూడికి చెందిన చంద్రశ్రీనివాస్ అనే వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకోవాలనుకున్నారు. శ్రీనివాస్ సోదరుడు చనిపోవడంతో వివాహం వాయిదా పడింది. తరువాత సదరు యువతి దొరైని ప్రేమిస్తున్నట్లు తెలిసి శ్రీనివాస్ అతన్ని పలుమార్లు బెదిరించడమే కాకుండా ఇటీవల నిడుమోలు వద్ద దాడి చేసి హెచ్చరించాడు. అయినా మాట వినకపోవడంతో మళ్లీ కొట్టడానికి ఆదివారం రాత్రి దొరై అద్దెకుంటున్న 17వ వార్డులోని ఇంటి వద్దకు వెళ్లి ఆరా తీశారు. అతను లేకపోవడంతో తన స్నేహితుడు సాయిప్రసాద్‌తో కలిసి దొరైకి చెందిన ద్విచక్ర వాహనాన్ని పెట్రోల్ పోసి తగలబెట్టారు. దీంతో చంద్రశ్రీనివాస్ పోలీసుల అదుపులో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనపై ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ దర్యాప్తు కొనసాగుతోందన్నారు.